క్లుప్తంగా

మత్స్య శాఖ కమిషనర్‌కు నివేదిక

సాక్షి ఎఫెక్ట్..

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని శనిగరం గ్రామంలో నిరుపయోగంగా చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంపై శుక్రవారం సాక్షి దినపత్రికలో 'చేప'ట్టకపోతే ఎట్లా శీర్షికతో ప్రచురితమైన కథనానికి జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం స్పందించారు. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. నిధుల కోసం మత్స్య శాఖ కమిషనర్‌కు నివేదిక పంపించామని, నిధులు విడుదలైన తర్వాత మరమతులు చేయిస్తామన్నారు.

డీఎస్పీ మహాసభ వాయిదా

మిరుదొడ్డి(దుబ్బాక): జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఈనెల 28వ తేదీన సిద్దిపేటలో జరిగే ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) మహాసభను వాయిదా వేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ర్యాగట్ల చందు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డీఎస్‌పీని స్థాపించి ఏడాదైన సందర్భంగా జిల్లాలో మహాసభ నిర్వహించాలని తీసుకున్న నిర్ణయాన్ని వర్షాల కారణంగా వాయిదా వేశామన్నారు. సభ ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ మండల అధ్యక్షుడు ఎర్రోల్ల దీపక్, ఉపాధ్యక్షుడు రవి, మండల నాయకులు శ్రీకాంత్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మద్దూరు(హుస్నాబాద్): గ్రామాల్లో ఇళ్ల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం గ్రామంలో పర్యటించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కొందరి ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు రావన్నారు. గ్రామంలో ఎవరికైనా జ్వరం వస్తే వైద్య సిబ్బందికి సమాచారం అందిస్తే వారే ఇంటికి వచ్చి మందులు ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువు తయారు చేయాలి

హుస్నాబాద్: ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారీ విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత మిగిలిన ఆహార పదార్థాలను పారబోయకుండా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆన్‌సైట్ కంపోస్ట్ డబ్బాలో వేయాలన్నారు. ఇలా వేసిన పదార్థాలు 60 నుంచి 90 రోజుల్లో ఎరువుగా తయారవుతుందన్నారు. పట్టణంలోని విద్యాసంస్థలు, హాస్టళ్లలో తడి, పొడిచెత్తను వేరుచేసి తడిచెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేసుకోవాలన్నారు. పొడిచెత్తను మున్సిపల్ సిబ్బందికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, హెచ్ఎం వెంకటయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, వనమహోత్సవ సూపర్‌వైజర్ శంకర్, పర్యావరణ అధికారి రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు ముందే విలీనం చేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజలకు హామీ ఇచ్చిన మేరకు బెజ్జంకిని కరీంనగర్ జిల్లాలో విలీనం చేసిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బెజ్జంకి మాజీ సర్పంచ్‌లు ద్యావనపెల్లి మంజుల, శ్రీనివాస్ శనివారం కోరారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బెజ్జంకి మండలాన్ని సిద్దిపేట నుంచి కరీంనగర్‌లోకి విలీనం చేస్తామని చెప్పారన్నారు. స్థానిక ఎన్నికలు సిద్దిపేటలో ఉన్నప్పుడు జరిగితే సమస్యలు తలెత్తుతాయని, కరీంనగర్ జిల్లాలోకి విలీనం చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలన్నారు. స్థానిక ప్రజల మనోభావాలను పట్టించుకోకుండా సిద్దిపేటలో చేర్చడంతో ఆందోళనలు జరిగాయని గుర్తుచేశారు. ఈ విషయంపై మంత్రి, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇస్తామని తెలిపారు.

విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

సిద్దిపేట ఎడ్యుకేషన్: విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని సిద్దిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి చందన సూచించారు. శనివారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ, మహిళా సాధికారత సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల మానసిక స్థితిని సోషల్ మీడియా దెబ్బతీస్తుందన్నారు. ఇన్‌స్టాగ్రాం, వాట్సాప్, ఫేస్‌బుక్‌లో వచ్చే మోసపూరిత మేసేజ్‌లను నమ్మి మోసపోవద్దన్నారు. మహిళా సాధికారత, ర్యాగింగ్, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధి ధర్మాజీపేట వార్డులోని ట్రాన్స్‌ఫార్మర్‌లో శనివారం ఉదయం మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే విద్యుత్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు.

పైసల్లేవు.. పనులు ఎలా?

పంచాయతీలకు నిధుల లేమి
- పారిశుద్ధ్య పనులు చేపట్టని సిబ్బంది
- వ్యాధులు ప్రబలే అవకాశం
- పట్టించుకోని అధికారులు

హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో అపరిశుభ్రం తాండవిస్తోంది. ఆరు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లోని రోడ్లు బురదమయంగా మారాయి. దీనికితోడు పంచాయతీల సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో దుర్గంధం భరించలేక ప్రజలు అల్లాడుతున్నారు. కనీస చర్యలు చేపడదామన్నా నిధులు లేకపోవడంతో అధికారులు చేతులెత్తేశారు. ప్రభుత్వం నిధుల విడుదల చేయాలని కోరుతున్నారు.


అక్కన్నపేట పంచాయతీ కార్యాలయ పక్క కాలనీలో రోడ్డుపై నిలిచిన మురుగు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంలో మొత్తం 32 గ్రామాలు ఉన్నాయి. అందులో 15కిపైగా మైనర్ పంచాతీయలు ఉన్నాయి. వాటిలో ఎనిమిది గిరిజన తండాలు నూతన పంచాయతీలు ఏర్పడ్డాయి. అయితే ఆరు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎస్ఎఫ్‌సీ ఫండ్, కేంద్రం నిధులు విడుదల కాలేదు. దీంతో ఏ చిన్న సమస్య వచ్చినా పంచాయతీ కార్యదర్శులే సొంత డబ్బులు వెచ్చించి పరిష్కరిస్తున్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. ఆయా కాలనీల్లో రోడ్లపై వర్షపు నీరు నిలిచి ఉండటంతో దోమలు, ఈగల వృద్ధి పెరగడంతో ప్రజలు అల్లాడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీలకు నిధులు విడుదలయ్యేలా చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

నిధులు విడుదల చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు నిధులు కేటాయించకపోవడంతో పల్లెల్లో ప్రగతి కుంటుపడింది. మౌలిక వసతులు కల్పించడం లేదు. ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుద్ధ్య పనులు జరగడంలేదు. చెత్తసేకరణ సక్రమంగా సాగడంలేదు. దీంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి.

– భానోతు సంతోష్ నాయక్, మాజీ సర్పంచ్, కపూర్‌నాయక్ తండా

ఫాగింగ్ చేయాలని చెప్పాం



గ్రామాల్లో దోమలు, ఈగల వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాం. అలాగే రోడ్లపై నిలిచిన వర్షపు నీరు, మురుగులో ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– భానోతు జయరాం, ఎంపీడీఓ అక్కన్నపేట మండలం

భూసేకరణ అక్రమాలను బయటకు తీస్తాం

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ధరమ్ గురువారెడ్డి

గజ్వేల్: ప్రస్తుత ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా పనిచేసినప్పుడు భూసేకరణ, ఇతర విషయాల్లో ఎన్నో అక్రమాలు జరిగాయని వాటిని బయటకు తీస్తామని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ధరమ్ గురువారెడ్డి అన్నారు. శనివారం పార్టీ గజ్వేల్ నియోజకవర్గ నేత జశ్వంత్‌రెడ్డితో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్, కలెక్టరేట్, గజ్వేల్, తున్కిబొల్లారం ఆర్అండ్ఆర్ కాలనీలు, వర్గల్ ఫుడ్ పార్కు కోసం సేకరించిన భూముల వ్యవహారంలో నిబంధనలు పాటించలేదని ఆరోపించారు. సాగు భూములు లాక్కొని పేదల కుటుంబాలను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ నిర్వాసితులకు సరైన నష్ట పరిహారం ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళి


నివాళులర్పిస్తున్న ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్

సిద్దిపేటకమాన్: అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్ ఆధ్వర్యంలో కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించినట్లు అధ్యక్షుడు వెంకటేశం తెలిపారు. చిన్నతనంలో పేపర్ బాయ్‌గా ప్రయాణం మొదలుపెట్టి గొప్ప సైంటిస్టుగా, భారత రాష్ట్రపతి అయ్యారన్నారు.

చేర్యాలలో..

చేర్యాల(సిద్దిపేట): మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం తొమ్మిదో వర్ధంతిని శనివారం మండల పరిధి నాగపురిలో అబ్దుల్ కలాం సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. అబ్దుల్ కలాం ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఐలయ్య, పంచాయతీ కార్యదర్శి రాజు, అబ్దుల్ కలాం సేవా సంస్థ గౌరవ అధ్యక్షుడు తుమ్మ మల్లయ్య, ప్రధాన కార్యదర్శి బండమీది కరుణాకర్, ఉపాధ్యక్షుడు గూడెపు మహేష్, ప్రతినిధులు తలారి శ్రీనివాస్, నాగపురి సత్యనారాయణ పాల్గొన్నారు.

బోనమెత్తిన చిన్నారులు


బోనాల వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట, సిద్దిపేట రూరల్ మండలాల పరిధిలోని పాఠశాలల్లో శనివారం ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను నిర్వహించారు. బాలికలు బోనాలతో, బాలురు పోతరాజుల వేషధారణలో అలరించారు. బోనాల పండగ విశిష్టతను ఉపాధ్యాయులు తెలియజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్‌కు అవార్డు



నంగనూర్(సిద్దిపేట): నంగనూర్ మండల పరిధి తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన సీఆర్పీఎఫ్ జవాన్ పుట్ట పవన్ కుమార్‌కు పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ అవార్డు దక్కింది. సీఆర్పీఎఫ్ వ్యవస్థాపక దినం సందర్భంగా న్యూఢిల్లీలోని సీఆర్పీఎఫ్ ఇన్‌స్టిట్యూషన్‌లో శనివారం అవార్డు అందజేశారు. 2020 ఫిబ్రవరి 9న సీఆర్పీఎఫ్, నక్సల్ మధ్య చత్తీస్‌గఢ్ రాష్ట్రం ఇరాపల్లి వద్ద ఎదురుకాల్పులు జరిగాయి. ఇందులో ముగ్గురు జవాన్లు అమరులుకాగా, ఆరుగురు గాయపడ్డారు. వారిలో తెలంగాణకు చెందిన తిమ్మాయిపల్లి పుట్ట పవన్‌కుమార్ ఉన్నారు.

కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలి

కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్

దుబ్బాక: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపడం దారుణమని, ఇందుకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ కాల్వ నరేష్ డిమాండ్ చేశారు. నిధుల కేటాయించనందుకు నిరసనగా శనివారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

సిద్దిపేటకమాన్: ఎవరైనా గుండెపోటుకు గురైతే వెంటనే వారిని సురక్షిత ప్రాంతానికి తరలించి సీపీఆర్ అందించాలని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వినోద్‌బాబ్జి అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో శనివారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండెపోటుకు గురైన వారికి సీపీఆర్ అందిస్తే వారి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. పదిమందిలో ఆరుగురు బ్రతికే అవకాశం ఉంటుందన్నారు. సీపీఆర్ ప్రాముఖ్యతను వివరించి సీపీఆర్‌పై ఇతరులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఆ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

చేర్యాల(సిద్దిపేట): ప్రభుత్వ అనుమతి లేకుండా పట్టణ కేంద్రంలో నడుస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని శనివారం జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు జింకల పర్వతాలు తెలిపారు. పట్టణ కేంద్రంలో నడుస్తున్న శ్రీ చైతన్య పాఠశాలకు అనుమతి లేదని, శుభోదయ స్కూల్ ఆవరణలో అదే పాఠశాల పేరు మీద నడిపిస్తూ పిల్లల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు.

సంక్షిప్త వార్తలు

◆ వృద్ధుడి అదృశ్యం



దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధి వృద్ధుడు అదృశ్యమైనట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్‌కు వార్డుకు చెందిన గంభీర్‌పూర్ ఇస్తారి (65) తన కూతురు సరిత ఉంటున్న మల్లాయపల్లికి వెళ్లి వస్తానని చెప్పి శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో వారు సరితకు ఫోన్ చేయగా తన ఇంటికి రాలేదని చెప్పడంతో భయాందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఇస్తారి కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. శనివారం ఇస్తారి కుమారుడు ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

◆ నూతన కార్యవర్గం

కొమురవెల్లి(సిద్దిపేట): జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో మండల నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా లింగంపల్లి శ్రీనివాస్, కాయిత శ్రీనాథ్, ప్రధాన కార్యదర్శులుగా సనాది భాస్కర్, బుడిగె భిక్షపతి, కార్యదర్శులుగా జంగని రవి, స్వాములపల్లి రమేష్, ఎంకి కనకయ్య, కంకణాల ప్రవీణ్, పంజాల మల్లేశం, చెట్టిపల్లి విజేందర్ రెడ్డి, బండి వెంకటేష్ ఎన్నికయ్యారు.

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో పది రోజుల క్రితం వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో 55 మంది పట్టుబడ్డారు. వారిని శనివారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన జడ్జి శ్రావణి రూ.38 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

◆ బడ్జెట్‌లో గొల్లకురుమలకు అన్యాయం

చిన్నకోడూరు(సిద్దిపేట): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్లలో గొల్లకురుమలకు అన్యాయం చేశారని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరి యాదవ్ మండిపడ్డారు. శనివారం చిన్నకోడూరులో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతోందని, రాష్ట్ర ప్రభుత్వం ఒక వర్గానికి వత్తాసు పలుకుతోందన్నారు. బడ్జెట్ కేటాయించనందుకు నిరసనగా తెలంగాణ వ్యాప్తంగా మందబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

◆ ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

సిద్దిపేటకమాన్: ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు చర్యలు చేపడతామని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రదేశాలను, ట్రాఫిక్ పాయింట్లను, బస్టాండ్ చౌరస్తాలు, రైతు బజార్, సుభాష్ రోడ్డు, గాంధీ రోడ్డు, ముస్తాబాద్ చౌరస్తాతో పాటు పలు ప్రాంతాలను ఎస్ఐ గోపాల్‌రెడ్డి, ఏఎస్ఐ ఉమేష్‌లతో కలిసి శనివారం పరిశీలించారు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత

దుబ్బాక ప్రథమ శ్రేణి జడ్జి తరణి


దుబ్బాక కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రథమ శ్రేణి న్యాయమూర్తి తరణి

దుబ్బాకటౌన్: ప్రతీ ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని, అవి భవిష్యత్తు తరాలకు ఉపయోగపడతాయని దుబ్బాక ప్రథమ శ్రేణి జడ్జి తరణి అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శనివారం దుబ్బాక కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటి ప్రజలు వనమహోత్సవంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్, న్యాయవాదులు, బాపురావు, భాస్కర్ రెడ్డి, సంజీవరెడ్డి, నాగరాజు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లద్నూరు ఉన్నత పాఠశాలలో..

మద్దూరు(హుస్నాబాద్): పర్యావరణ పరిరక్షణలో నాటిన మొక్కలను సంరక్షించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రామడుగు బాలరాజు అన్నారు. శనివారం వనమహోత్సవంలో భాగంగా మండలంలోని లద్నూరు ఉన్నత పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జీడికంటి సుదర్శన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, హెచ్ఎం కృష్ణవేణి, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పూల కనకయ్య, అంగన్‌వాడీ టీచర్లు విజయ, ఎలిజబెత్ పాల్గొన్నారు.

రుణమాఫీ లబ్ధిదారులు రెన్యువల్ చేసుకోండి

యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాకేష్


ధ్రువపత్రాలు స్వీకరిస్తున్న సిబ్బంది

చిన్నకోడూరు(సిద్దిపేట): రుణమాఫీ లబ్ధిదారులు బ్యాంకుల్లో రెన్యువల్ చేసుకోవాలని చిన్నకోడూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాకేశ్ తెలిపారు. శనివారం రైతు రుణమాఫీ సందర్భంగా బ్యాంకు ఆధ్వర్యంలో మండల పరిధిలోని పెద్దకోడూరులో క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.లక్ష లోపు రుణమాఫీ పొందిన రైతులు తమ ఆధార్ కార్డు, 1బీ, పట్టాదారు పాసు పుస్తకం తెచ్చి రెన్యువల్ చేసుకోవాలన్నారు. రైతులు రెన్యువల్ చేసుకున్న అనంతరం కొత్త రుణాలు ఇస్తామన్నారు. ప్రతీ గ్రామంలో రుణమాఫీ క్యాంపు నిర్వహించి రుణమాఫీపై రైతులకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ సృజన, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది దగాకోరు పాలన


ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

దుబ్బాక: ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ దగాకోరు పాలన సాగిస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు అంబటి బాలేష్‌గౌడ్ అన్నారు. అధికార పార్టీ ఇచ్చిన హామీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా మోసం చేస్తోందని నిరసిస్తూ దుబ్బాకలో ధర్నాను చేపట్టారు. ఆందోళన చేస్తున్న నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎస్ఎన్‌చారి తదితరులు పాల్గొన్నారు

నిర్మాణాలు పూర్తి చేయాలి

హుస్నాబాద్: హుస్నాబాద్ బస్టాండ్‌లో చేపట్టిన నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని ఆర్టీసీ ఈడీ వినోద్‌కుమార్ అన్నారు. శనివారం బస్టాండ్‌ను సందర్శించి స్టాళ్లను పరిశీలించారు. ఇటీవల బస్టాండ్ ఆధునీకరణ పనులు ప్రారంభించారు. నూతనంగా ప్లాట్‌ఫామ్‌లు, టాయిలెట్ల నిర్మాణాలు, ఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయి. త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి

గజ్వేల్‌రూరల్: రజకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రాచమల్ల ఎల్లేష్ డిమాండ్ చేశారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం లాండ్రీలకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను సరఫరా చేసిందని, కొన్ని నెలలుగా విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం వాటిని చెల్లించాలని కోరుతున్నామన్నారు. బడ్జెట్‌లో రజకులకు సరైన కేటాయింపులు లేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్య ఉద్యమం

సిద్దిపేట జోన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యాయని, హక్కుల సాధనకు ఐక్య ఉద్యమాలు చేస్తామని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) జాతీయ ఉపాధ్యక్షుడు, సెంట్రల్ పీఎఫ్ బోర్డు సభ్యుడు మల్లేశం పేర్కొన్నారు. శనివారం సిద్దిపేటలో చింతన్ బైఠక్ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు 15, 16, 17వ తేదీల్లో ముంబైలో జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించి, భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

పిచ్చిమొక్కలు తొలగించండి

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి

గజ్వేల్: ఓపెన్ ప్లాట్లల్లో యాజమానులు పిచ్చిమొక్కలు తొలగించకపోతే చర్యలు తప్పవని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి హెచ్చరించారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో కమిషర్ గోల్కొండ నర్సయ్యతో కలిసి పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పలు కాలనీల్లో ఓపెన్ ప్లాట్లను యజమానులు వదిలేయడంతో పిచ్చిమొక్కలు పెరిగిపోవడమేకాకుండా చెత్తచెదారం పేరుకుపోతోందన్నారు. దీంతో పరిసరాల్లోని ఇంటి యజమానులకు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, లేనిపక్షంలో నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ భాగ్యలక్ష్మి, మున్సిపల్ ఏఈ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూములు కాపాడాలి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని శభాష్‌గూడెం వీరభద్ర స్వామి శివాలయం భూములు కాపాడాలని కోరుతూ శనివారం పలువురు గ్రామస్తులు మాజీ ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మాజీ సర్పంచ్ స్వప్న ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేవాలయంలో నిత్య పూజలు చేసే పూజారి జీతభత్యాల నిమిత్తం దానంగా ఇచ్చిన భూములను కొందరు తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. పట్టా చేసుకున్న వారు భూసర్వే చేయాలని ఏడీకి దరఖాస్తు చేసుకోవడంతో నోటీసులు జారీ చేశారన్నారు. భూసర్వే నిలిపివేసి ఆ భూమి దేవాలయానికి చెందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.